సాక్షి పల్నాడు

ఆదివారం । 27 । అక్టోబర్ । 2024



నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో నిత్యాన్నదానానికి గుంటూరు నవభారత్‌నగర్‌కు చెందిన టి.శారద. శ్రీనివాస్‌లు రూ.లక్ష అందించారు.



శాస్త్రీయ సంగీత మహోత్సవాలు

నగరంపాలెం: స్థానిక వెంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలోని కళావేదికపై రెండు రోజులపాటు జరిగే వాగ్గేయకార శాస్త్రీయ సంగీత మహోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి.



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 43,094 క్యూసెక్కులు వచ్చిచేరుతుంది. దిగువకు 44,222 క్యూసెక్కులు వదులుతున్నారు.

న్యూస్‌రీల్

అమరేశ్వరుడి హుండీల ఆదాయం రూ.23.85 లక్షలు



అమరావతి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అమరావతిలో వేం చేసియున్న బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం హుండీల లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. హుండీల లెక్కింపును దేవదాయశాఖ పెదకూరపాడు గ్రూపు దేవస్థానాల ఈవో సత్యనారాయణరెడ్డి సమక్షంలో దేవాలయంలో ఉన్న 12 హుండీలను తెరచి అందులో ఉన్న నగదును భక్తులచే లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. లెక్కింపు అనంతరం ఆలయ కార్యనిర్వహణాధికారి సునీల్‌కుమార్ మాట్లాడుతూ దేవాలయంలో ఉన్న హుండీల ఆదాయం మొత్తం రూ.21,88,190, అన్నదాన మండపంలోని హుండీ ద్వారా రూ.1,96,861 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఈ నగదు మొత్తాన్ని వివిధ బ్యాంకులలో ఉన్న దేవాలయ ఖాతాలకు జమ చేస్తున్నామన్నారు. లెక్కింపు కార్యక్రమంలో నరసరావుపేట, గుంటూరు, విజయవాడలకు చెందిన సేవా సమితి సభ్యులు, దేవాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విశ్వతేజ స్పిన్నింగ్ మిల్స్‌కు రెడ్‌క్రాస్ అవార్డు



నాదెండ్ల: మండలంలోని బోయపాలెంలో ఉన్న విశ్వతేజ స్పిన్నింగ్ మిల్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు ఇండియన్ రెడ్‌క్రాస్ అసోసియేషన్ నుంచి అవార్డు దక్కింది. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో రెడ్‌క్రాస్ వార్షిక సమావేశం భారతీయ విద్యాభవన్‌లో శనివారం నిర్వహించారు. గుంటూరు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి చేతుల మీదుగా రెగ్యులర్ బ్లడ్ డోనార్స్ అవార్డులు అందజేశారు. విశ్వతేజ మిల్స్ టెక్నికల్ డైరెక్టర్ గంటా సీతయ్య, హెచ్‌ఆర్ మేనేజర్ చల్లా రమణ మూర్తిలకు అవార్డులు అందించారు. రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

లెటర్ రైటింగ్‌పై జాతీయ స్థాయి పోటీలు

నరసరావుపేటటౌన్: లెటర్ రైటింగ్‌పై జాతీయ స్థాయిలో పోటీలు నిర్వహిస్తున్నట్లు పోస్టల్ డివిజనల్ సూపరింటెండెంట్ వెంకటస్వామి శనివారం తెలిపారు. 18 ఏళ్లలోపు వారికి, 18 ఏళ్లు పైబడిన వారికి విడివిడిగా జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో మూడు విభాగాలుగా పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జాతీయ స్థాయిలో మొదటి బహుమతి రూ.50వేలు, ద్వితీయ బహుమతి రూ.25వేలు, తృతీయ రూ.10వేలు, రాష్ట్రస్థాయిలో మొదటి బహుమతి రూ.25వేలు, ద్వితీయ రూ.10వేలు, తృతీయ రూ.5వేలు విజేతలకు అందించనున్నారు.

ప్రాణాలు పోయాక కదలిక !

- నరసరావుపేట, సత్తెనపల్లి, గుంటూరుల్లో బాధితులకు చికిత్స
- అందుబాటులో వైద్య సిబ్బంది
- ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా
- ఇంకా రాని నీటి పరీక్ష ఫలితాలు



డయేరియా బాధితురాలు మాధవికి వైద్య సేవలు అందిస్తున్న వైద్య సిబ్బంది

దాచేపల్లి: ప్రాణాలు పోయాక ప్రభుత్వం కదిలింది. దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలోని అంజనాపురం కాలనీలో సహాయక చర్యలు చేపట్టింది. వైద్య సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉంటూ బాధితులను పర్యవేక్షిస్తున్నారు. కాలనీలో పారిశుద్ధ్య పరిస్థితి మెరుగుకు సిబ్బంది శ్రమిస్తున్నారు. డయేరియా బారిన పడి ఇద్దరు మృతి చెందగా మరో 17మంది వాంతులు, విరేచనాలతో వైద్య సేవలు పొందుతున్నారు. శనివారం తాజా మరో ఆరు కేసులు నమోదు అయ్యాయి. ఈ నేపథ్యంలో బాధితులకు వైద్య సేవలు కొనసాగుతున్నాయి. వైద్య శిబిరాలు శనివారం కూడా కొనసాగించారు. వైద్య శిబిరాల్లో ప్రాథమిక చికిత్స అందించిన తరువాత మెరుగైన వైద్యం కోసం నరసరావుపేట, గుంటూరు, సత్తెనపల్లి ప్రభుత్వ ఆస్పత్రులకు తరలిస్తున్నారు. చల్లా దుర్గారావు పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. తమ్మిశెట్టి కార్తీక(4) సత్తెనపల్లి ఏరియా ప్రభుత్వ వైద్యశాలలో నాలుగు రోజుల నుంచి చికిత్స పొందుతుంది. తమ్మిశెట్టి వెంకటేశ్వరరావు నరసరావుపేట ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరితో పాటు మరికొంతమంది బాధితులు ప్రభుత్వ, ప్రైవేట్ హాస్పిటల్స్‌లో చికిత్స పొందుతున్నారు. డాక్టర్ ఇమ్మడిశెట్టి అమూల్య, డాక్టర్ మధు, డాక్టర్ షాహిన్ సుల్తానా వైద్య శిబిరాల్లో ఉంటూ వైద్య సేవలు అందిస్తున్నారు. వైద్య శిబిరాలు, పీహెచ్‌సీలలో ఐదుగురు డాక్టర్లు, ఇద్దరు హెల్త్ అసిస్టెంట్స్, ఐదుగురు సూపర్‌వైజర్లు, 10మంది ఏఎన్‌ఎంలు, 20 మంది ఆశ కార్యకర్తలు విధులు నిర్వహిస్తూ వైద్య సేవలను కొనసాగిస్తున్నారు. పరిస్థితి పూర్తిగా చక్కబడే వరకూ వైద్య శిబిరాలను కొనసాగిస్తామని డాక్టర్ అమూల్య చెప్పారు.

మెరుగుపడిన పారిశుద్ధ్యం

అంజనాపురం కాలనీలో పారిశుద్ధ్యం మెరుగుపడింది. ఈ కాలనీలో డయేరియా కేసులు నమోదు కావటంతో అధికారులు అప్రమతమై పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక దృష్టిని సారించారు. మురికి కాలువల్లో పేరుకుపోయిన పూడిక తొలగించారు. బురదమయంగా ఉన్న చోట్ల మట్టి వేసి చదును చేశారు. రోడ్లు, వీధుల్లో ఏపుగా పెరిగిన చెట్లను తొలగించారు. తాగునీటి పైపులైన్లకు లీకేజీలు ఉన్న చోట మరమ్మతులు చేపట్టారు. దోమలు వ్యాప్తి చెందకుండా తగిన చర్యలు చేపట్టారు. నగర పంచాయతీ చైర్‌పర్సన్ కొప్పుల సుబ్బమ్మ, కమిషనర్ ఏవీ.అప్పారావు, కౌన్సిలర్ దేవళ్ల ప్రసన్నలక్ష్మి, మురుగుడు రఘు, నాయకులు సొసైటీ నారాయణ, వేముల తిరుమలకుమార్, వేముల కృష్ణ, నర్రా పుల్లయ్య, బుల్లెబ్బాయి తదితరులు కాలనీలో పర్యటించి పారిశుద్ధ్యం పనులు మెరుగుదలకు చర్యలు తీసుకున్నారు.



సీజ్ చేసిన బోరు వద్ద చెత్త తొలగిస్తున్న కార్మికులు

ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా

అంజనాపురం కాలనీలో నివసిస్తున్న ప్రజలకు ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. ఈ కాలనీలోని బోరు నీరు కలుషితం కావటంతో అధికారులు సీజ్ చేశారు. దీంతో దాచేపల్లి, గురజాల నగర పంచాయతీలు, పిడుగురాళ్ల మున్సిపాలిటీల నుంచి ట్యాంకర్లను తెప్పించి సురక్షిత తాగు నీరు ప్రజలకు అందిస్తున్నారు. ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్న నీటిలో క్లోరినేషన్ పరీక్షలు చేసిన తరువాతనే ప్రజలకు అందిస్తున్నారు. కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగేలా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. సీజ్ చేసిన బోరు నుంచి సేకరించిన నీటి నమూనాలను ల్యాబ్‌కి పంపించారు. పరీక్ష ఫలితాలు ఇంకా రాలేదు.



శిశు గృహానికి చేరిన చిన్నారి

- పసికందును న్యాయమూర్తి ఎదుట హాజరు
- బెంచ్ ఆదేశాలతో శిశు గృహానికి తరలింపు
- కొనసాగుతున్న శిశువుల గాలింపు

నరసరావుపేట టౌన్: విక్రయానికి గురైన చిన్నారి అధికారుల చొరవతో శిశు గృహానికి చేరింది. నరసరావుపేట కేంద్రంగా శిశు విక్రయాల రాకెట్ వెలుగు చూసిన విషయం విదితమే. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శిశు సంక్షేమశాఖ అధికారులు, మహిళా పోలీసులు విచారణ చేపట్టారు. ప్రైవేటు వైద్యశాలలో గతంలో ఆయాగా పనిచేసిన మహిళ శిశు విక్రయాలలో దళారీగా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. ఆమె ఇచ్చిన సమాచారం మేరకు విక్రయానికి గురైన 5 నెలల పసిపాపను పనసతోటలో గుర్తించారు. సదరు పాపను కొనుగోలు చేసిన వారి వద్ద నుంచి అధికారులు తమ సంరక్షణలోకి తీసుకొన్నారు. ఉన్నతాధికారుల ఆదేశం మేరకు గుంటూరులోని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ బెంచ్ ఆఫ్ మేజిస్టేట్ ఎదుట శనివారం పాపను హాజరు పరిచారు. న్యాయమూర్తి ఆదేశాల మేరకు పాపను శిశు గృహకు తరలించి అధికారుల సంరక్షణ కల్పించారు. ఇదిలా ఉండగా విక్రయానికి గురైన మరో ముగ్గురు శిశువుల ఆచూకీ కోసం పోలీసులు గోప్యంగా విచారిస్తున్నారు. శిశు విక్రయాలపై పోలీసులు ఎటువంటి కేసు నమోదు చేయలేదు. కలెక్టర్ అందిన ఆకాశరామన్న ఉత్తరం ఆధారంగా విచారణ చేపట్టిన పోలీసులు, జిల్లా బాలిక సంరక్షణ అధికారులు రాకెట్‌ను గుర్తించారు. శిశువును విక్రయించిన వారు తమ ఆర్థిక ఇబ్బందుల కారణంగానే దీనికి పాల్పడినట్టు అంగీకరించారు. దీనిపై ఫిర్యాదు చేసేందుకు నిరాకరించారు. దీంతో సుమోటోగా కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగించాలన్న ఆలోచనలో పోలీసులు ఉన్నట్టు తెలియవచ్చింది.

రూ.34 లక్షలు టోకరా

- పెట్రోలు బంకు యజమానులను మోసగించిన దంపతులు
- ఇరువురిపై కేసు నమోదు

అద్దంకి రూరల్: నమ్మి ఉద్యోగమిచ్చిన యజమానులకే టోకరా వేశారు దంపతులు. విదేశాల్లో వ్యాపారం చేసుకుంటూ నమ్మకస్తులని భార్యాభర్తలను నమ్మి పెట్రోలు బంకు మేనేజర్లుగా నియమిస్తే యజమానులకే రూ.34 లక్షలు టోకరా పెట్టిన దంపతులపై శనివారం సీఐ కృష్ణయ్య కేసు నమోదు చేశారు. సీఐ వివరాల మేరకు.. గుంటూరు దేవపురానికి చెందిన జెల్ది అనిల్‌కుమార్, తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా సింగరేణికి చెందిన గార్లపాటి రంజిత్‌కుమార్‌లు దక్షిణాఫ్రికాలో వ్యాపారాలు నిర్వహిస్తుంటారు. వీరిద్దరూ కలిసి అద్దంకిలోని గరటయ్య కాలనీ ఎదురుగా మూడేళ్ల కిందట గార్లపాటి పెట్రోలియమ్స్ పేరుతో పెట్రోలు బంకు ఏర్పాటు చేశారు. దీనికి మేనేజర్లుగా తమకు పరిచయం ఉన్న ప్రకాశం జిల్లా చీమకుర్తి అంబేడ్కర్‌నగర్‌కు చెందిన బత్తుల వెంకటేశ్వర్లు, అతని భార్య మల్లేశ్వరిలను నమ్మి ఇరువురికి నెలకు రూ.8 వేల చొప్పున జీతమిస్తూ మేనేజర్లుగా నియమించి దక్షిణాఫ్రికాకు వెళ్లారు. యజమానులు సంవత్సరానికి ఒకసారి వచ్చి పెట్రోలు బంకును సందర్శించి వ్యాపార లావాదేవీలు, లెక్కలు చూసుకొని వెళ్తుండేవారు. ఈ నేపథ్యంలో యజమానులు ఇక్కడ లేకపోవడంతో దంపతులు మూడు నెలలుగా పెట్రోలు, డీజిల్ అమ్మగా వచ్చిన డబ్బులను యజమాని ఖాతాకు జమ చేయకుండా కస్టమర్ల నుంచి ఫోన్‌పే ద్వారా తమ ఖాతాలకు మళ్లించుకున్నారు. గత నెలలో యజమాని గార్లపాటి రంజిత్ కుమార్ ఇండియాకు వచ్చారు. అద్దంకి వచ్చి లెక్కలు చూసుకునేందుకు పెట్రోలు బంకుకు రాగా మేనేజర్లు లేకపోవటంతో అనుమానంతో విచారించారు. తమను మోసగించి రూ.30 లక్షల మేర సొంతానికి వాడుకున్నారని గ్రహించారు. ఇదే కాకుండా తనకు బ్యాంకులో రుణం ఉందని అది విడిపించటానికి గతంలో రూ.4 లక్షలు కావాలని అకౌంట్‌కు ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నారు. వారి ఇంటికి వెళ్లి గట్టిగా నిలదీయటంతో తమ వద్ద ఏమీ లేవని, నీ ఇష్టం వచ్చింది చేసుకోమని బెదిరించి దాడికి పాల్పడ్డారు. దీంతో యజమానులు అద్దంకి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వెనుకబడిన వర్గాల సమస్యల పరిష్కారానికి చొరవ



కలెక్టరేట్‌లో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

నరసరావుపేట: కలెక్టరేట్‌లో కలెక్టర్ పి.అరుణ్ బాబు అధ్యక్షతన శనివారం నిర్వహించిన ప్రత్యేక ఎస్సీ, ఎస్టీల ప్రజాసమస్యల పరిష్కార వేదికలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వారిచే 13 అర్జీలను స్వీకరించారు. తక్షణమే స్పందించిన జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖలకు ఆయా అర్జీలను అందజేసి వెంటనే పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వెనుకబడిన వర్గాల వారి సమస్యల కోసం ప్రత్యేకంగా చొరవ తీసుకుని ప్రతి నెలా నాలుగవ శనివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. అవకాశాన్ని ప్రజలు ఉపయోగించుకోవాలని కోరారు. జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే, జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం, అధికారులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల విజయం

తొలగించిన వారిని విధుల్లోకి తీసుకునేందుకు అధికారుల అంగీకారం

నరసరావుపేట: మున్సిపల్ కార్మికులు విజయం సాధించారు. గత 23 రోజుల నుంచి చేస్తున్న పోరాటం ఫలితంగా రాజకీయ కారణాలతో విధుల నుంచి తొలగించిన వారిలో ఎనిమిది మందిని మళ్లీ విధుల్లోకి తీసుకునేందుకు అధికారులు అంగీకరించారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం మున్సిపల్ కార్యాలయం ఎదుట రిలేదీక్షలు చేస్తున్న వారికి మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు నిమ్మరసం ఇచ్చి దీక్షలు ఉపసంహరింపచేసినట్లు సీఐటీయూ పట్టణ కార్యదర్శి డి.యోహాను శనివారం వెల్లడించారు. దీంతో ఈనెల 3వ తేదీ నుంచి నిర్వహిస్తున్న శిబిరాన్ని ఉపసంహరించామని పేర్కొన్నారు. దీనిని కమిషనర్ జస్వంతరావు ధ్రువీకరించారు.

బతుకుదెరువు కోసం వచ్చి బలి

నీటి కుంటలో పడి ఇద్దరు మహిళలు మృతి



సంఘటనా ప్రాంతంలో మృతదేహాలు

బొల్లాపల్లి: బతుకుదెరువు కోసం వలస కూలీలుగా వచ్చిన మహిళలు ఇరువురు పొలంలో నీటి కుంటలో పడి ప్రాణాలు కోల్పోయారు. ఈ సంఘటన బొల్లాపల్లిలో శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... ఒడిశా రాష్ట్రం నుంచి సుమారు 40మంది మహిళలు, పురుషులు వలస కూలీలుగా బొల్లాపల్లి శివారు పరిధిలోని తోటలో పనికి వచ్చారు. కొంతకాలం కిందట ఈ ప్రాంతంలో సుమారు 80 ఎకరాలను విజయవాడకు చెందిన నాగరాజు, రమేష్‌లు కొనుగోలు చేసి శ్రీగంధం తోట సాగు చేస్తున్నారు. తోటలో పనిచేసేందుకు ఒడిశాకు చెందిన కార్మికులు వలస వచ్చారు. వీరు ప్రతిరోజూ పని ప్రదేశంలోని పొలంలో ఉన్న నీటి కుంటలో కాలకృత్యాలు తీర్చుకోవడంతోపాటు బట్టలు ఉతకడం తదితర పనులు అక్కడే నిర్వహిస్తుంటారు. శనివారం నలుగురు మహిళలు నీటి కుంట వద్దకు వచ్చి కాలకృత్యాలు తీర్చుకుంటున్నారు. మన్నంగి ఉమా (18), మల్లికా జున్ను (21)లు స్నానం చేసేందుకు నీటి కుంటలో దిగి మునిగిపోయారు. ఇది గమనించి మరో ఇరువురు మహిళలు కేకలు వేయడంతో అక్కడ ఉన్నవారు పరుగెత్తుకొని వచ్చి కుంటలోని మహిళలను బయటకు తీశారు. అప్పటికే వారు మృతి చెందారు. సంఘటనా ప్రాంతాన్ని నరసరావుపేట డీఎస్పీ కె.నాగేశ్వరరావు, వినుకొండ రూరల్ సీఐ బి.ప్రభాకర్, బండ్లమోటు ఎస్ఐ ఎ.బాలకృష్ణలు సందర్శించి వివరాలు సేకరించారు. మృతి చెందిన వారి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బండ్లమోటు ఎస్ఐ తెలిపారు. మృతులను పోస్టుమార్టం నిమిత్తం వినుకొండ ప్రభుత్వవైద్యశాలకు తరలించారు. అనంతరం కుటుంబసభ్యులకు అందజేశారు.

సంక్షేమ వసతి గృహాలు తనిఖీ




విద్యార్థులతో కలసి భోజనం చేస్తున్న న్యాయమూర్తులు

ముప్పాళ్ల(సత్తెనపల్లి): సత్తెనపల్లి సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికార కమిటీ చైర్మన్ సిహెచ్ వెంకటనాగశ్రీనివాసరావు, జూనియర్ సివిల్ జడ్జి తౌషిద్ హుస్సేన్‌లు శనివారం సత్తెనపల్లి పరిధిలోని ఎనిమిది ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలను సందర్శించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. బెల్లంకొండ, పాపాయిపాలెం, రాజుపాలెం, సత్తెనపల్లి పట్టణంలోని రైల్వే గేటు వద్ద ఉన్న రెండు వసతి గృహాలను, పార్కు వద్ద నున్న వసతి గృహాన్ని, వెంకటపతి కాలనీలో ఉన్న వసతి గృహాన్ని, వాసవినగర్ దగ్గర్లోని వసతి గృహాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. బెల్లంకొండలో ఉన్న ఎస్టీ ప్రభుత్వ వసతి గృహాన్ని సందర్శించి, ఒకే ప్రాంగణంలో పాఠశాల, వసతి గృహం ఉన్న చోట విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కొన్నిచోట్ల పైకప్పు పెచ్చులు ఊడటాన్ని గమనించారు. అనేక చోట్ల వసతి గృహ సిబ్బందికి పలు సూచనలు చేశారు. న్యాయవాది బీఎల్ లక్ష్మీకోటేశ్వరరావు, పారా లీగల్ వలంటీర్ షేక్ సుభాని తదితరులు పాల్గొన్నారు.

చిత్తశుద్ధితో పనిచేస్తే విజయం తథ్యం

వైఎస్సార్ సీపీ నేత గౌతంరెడ్డి



మాట్లాడుతున్న గౌతంరెడ్డి

దాగంటివారిపాలెం(ముప్పాళ్ల): వైఎస్సార్ సీపీ శ్రేణులంతా సమష్టిగా చిత్తశుద్ధితో పని చేస్తే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపు తథ్యమని వైఎస్సార్ సీపీ నేత పి.గౌతం రెడ్డి చెప్పారు. మండలంలోని దాగంటివారిపాలెం గ్రామంలోని సాయిబాబా ఆలయ ఆవరణలో శనివారం వైఎస్సార్ సీపీ ముఖ్య నేతలతో పట్టభద్రుల ఓట్ల చేరికపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీకి కార్యకర్తలే బలమైన పునాది అని, ఓటమిని వదిలేసి మళ్లీ గెలుపు కోసం కృషిచేయాలన్నారు. ఈ గెలుపుతో రాష్ట్రంలో వైఎస్సార్ సీపీకి ప్రజల ఆదరణ తగ్గలేదని నిరూపించాలన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా పది మంది పట్టభద్రుల ఓట్లను చేర్పిస్తే వైఎస్సార్ సీపీ అభ్యర్థి గెలుపు ఖాయమన్నారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు చిట్టా విజయభాస్కరరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ ఎంజేఎం రామలింగారెడ్డి, శ్రీనివాస రెడ్డి, అంకాళ్ల వెంకటేశ్వర్లు, రెండెద్దుల వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఏసీఏ అండర్–19 రెండో మ్యాచ్ ప్రారంభం

తొలి ఇన్నింగ్స్‌లో గ్రూప్–ఏ 216 పరుగులకు ఆలౌట్


ఎస్.భార్గవ్ మహేష్, 5 వికెట్లు, (గ్రూప్–సి)

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీఏ ఎస్‌కేఆర్‌బీఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో ఏసీఏ అండర్–19 రాష్ట్ర జట్టు ఎంపిక మ్యాచ్‌ల్లో భాగంగా శనివారం గ్రూప్–ఏ, గ్రూప్–సి జట్ల మధ్య రెండవ మ్యాచ్ ప్రారంభమైంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న గ్రూప్–ఏ జట్టు తన తొలి ఇన్నింగ్స్‌లో 59.5 ఓవర్లలో 216 పరుగులకు ఆలౌట్ అయింది. జట్టులోని జి.వి.చరణ్‌జిత్ 48, పరమ్‌వీర్‌సింగ్ 48, జి.ఈశ్వర్ రిత్విక్ 46 పరుగులు సాధించారు. గ్రూప్–సి బౌలర్ ఎస్.భార్గవ్‌మహేష్ 15.5 ఓవర్లు వేసి 50 పరుగులు ఇచ్చి 5 వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన గ్రూప్–సి జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 3 వికెట్లు నష్టానికి 88 పరుగులు సాధించింది. జట్టులోని బి.మధుసూధన్ 43 పరుగులు సాధించాడు. గ్రూప్–ఏ బౌలర్ ఎన్.రాజేష్‌కు 2 వికెట్లు లభించాయి. మ్యాచ్‌ను గ్రౌండ్ అడ్మినిస్ట్రేటర్ ఎన్.సీతాపతి రావు పర్యవేక్షించారు.

పోలీసు సిబ్బందికి వ్యాసరచన పోటీలు



నరసరావుపేట: పోలీసు అమరవీరుల స్మారకోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు సిబ్బందికి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు పరిపాలనా విభాగం అదనపు ఎస్పీ జేవీ సంతోష్ ఆధ్వర్యంలో ప్రస్తుత సమాజంలో పర్యావరణాన్ని రక్షించడంలో పోలీసులకు ఎదురయ్యే సవాళ్లు అనే అంశంపై పోటీలు నిర్వహించారు. పోలీసుల సేవలు, దైనందిన విధులు, త్యాగాలపై అవగాహన చేసుకోవడం, గుర్తించడం చాలా ముఖ్యమని పేర్కొన్నారు. పోటీల్లో జిల్లా ప్రధాన కార్యాలయంలోని ఏఆర్, ఏఎన్ఎస్ సిబ్బంది, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీలను అడ్మిన్ ఆర్ఐ రాజా పర్యవేక్షించారు.

మెరుగైన వైద్య సేవల బాధ్యత ఏఎన్ఎంలదే

నగరం: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాల్సిన బాధ్యత ఏఎన్ఎంలదేనని ఆరోగ్యశాఖ జిల్లా గణాంకాధికారి డాక్టర్ పి.వేణు చెప్పారు. మండలంలోని పెద్దవరం, బొరమాదిగపల్లి ఆరోగ్య ఉపకేంద్రాలను శనివారం జిల్లా వైద్యారోగ్య శాఖ టాస్క్‌ఫోర్స్ టీం పరిశీలించింది. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ.. గ్రామాలలో వైద్య సిబ్బంది సేవల తీరును తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తల పనితీరుపై గ్రామస్తుల నుంచి వివరాలు సేకరించినట్లు చెప్పారు. రిజిస్టర్‌లను పరిశీలించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు సీహెచ్ మల్లికార్జునరావు, లక్ష్మణ్, చినమట్టపూడి, ధూళిపూడి పీహెచ్‌సీల డాక్టర్లు మంజూష, నజీలా పర్వీన్, సీహెచ్‌వో బాబురావు పాల్గొన్నారు.

ఆదాయానికి బదులు ఆత్మహత్యలు రెట్టింపు

- తీవ్ర సంక్షోభంలో వ్యవసాయరంగం
- సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు వి.కృష్ణయ్య


సీపీఎం కార్యాలయంలో నూతన కమిటీ సభ్యులతో రాష్ట్ర కమిటీ సభ్యులు కృష్ణయ్య, విజయకుమార్

నరసరావుపేట: దేశం, రాష్ట్రంలో వ్యవసాయ రంగం తీవ్రమైన సంక్షోభంలో ఉందని, రైతుల ఆదాయానికి బదులుగా ఆత్మహత్యలు రెట్టింపు అయ్యాయని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు వి.కృష్ణయ్య పేర్కొన్నారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట కోటప్పకొండ రోడ్డులోని సీపీఎం కార్యాలయంలో శనివారం పార్టీ నరసరావుపేట మండల సర్వసభ్య సమావేశం జిల్లా కమిటీ సభ్యులు డి.శివకుమారి అధ్యక్షతన నిర్వహించారు. దీనికి హాజరైన కృష్ణయ్య మాట్లాడుతూ పాలకుల విధానాలతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారి ఏడాదికి రూ.2.50 లక్షల కోట్ల ఆదాయాన్ని పారిశ్రామిక వేత్తలకు ధారాదత్తం చేస్తున్నారన్నారు. రానురాను వ్యవసాయ ఉత్పత్తులు తగ్గిపోతున్నాయని, కార్మిక రంగం అన్ని విధాల వెనుకబడటమే దీనికి నిదర్శనమని అన్నారు. దేశంలో నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉందని, చదువుతున్న యువత ఉద్యోగాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. నవంబర్ 26న దేశవ్యాప్తంగా 500 జిల్లాల్లో రైతులు, కౌలు రైతులు, కార్మికులతో కలిసి అన్ని కలెక్టరేట్ కార్యాలయాల వద్ద చేపట్టనున్న ధర్నా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ మాట్లాడుతూ పెరిగిన ధరలకు వ్యతిరేకంగా వచ్చే నెల 8 నుంచి 15వ తేదీ వరకు వాడ వాడల పార్టీ నాయకులు, కార్యకర్తలు పర్యటించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగట్టాలన్నారు. అనంతరం నరసరావుపేట పార్టీ మండల కమిటీ కన్వీనర్‌గా డి.శివకుమారి, సభ్యులుగా షేక్ సిలార్ మసూద్, మేడం ఆంజనేయులు, షేక్ రబ్బాని, కొమ్ముల నాగేశ్వరరావు, టి.పెద్దిరాజులను ఎన్నుకున్నారు. సీనియర్ నాయకులు ఏవీకే దుర్గారావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.ఆంజనేయ నాయక్, నాయకులు కేపీ మెటిల్డా దేవి, కామినేని రామారావు, కొండ్రు ఆంజనేయులు, ఈవూరి మస్తాన్ రెడ్డి, బీరెడ్డి పుల్లారెడ్డి పాల్గొన్నారు.

ఉమ్మడి గుంటూరు స్విమ్మింగ్ జట్ల ఎంపిక


స్విమ్మింగ్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో స్కూల్ గేమ్స్ కార్యదర్శి సురేష్‌కుమార్

నరసరావుపేట ఈస్ట్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శనివారం శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల స్విమ్మింగ్ పూల్ వద్ద ఉమ్మడి గుంటూరు జిల్లా స్విమ్మింగ్ జట్ల ఎంపిక పోటీలు నిర్వహించారు. జిల్లా జట్లుకు ఎంపికైన క్రీడాకారుల వివరాలను పల్నాడు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఎన్.సురేష్‌కుమార్ ప్రకటించారు.

అండర్–14 బాలుర విభాగంలో కె.సంజీవన్ సాయి, బి.నాగచైతన్య, ఆర్.లోహిత్, బి.సాయిదీపక్‌రెడ్డి, బి.అర్జున్‌రెడ్డి, వై.గౌహర్, కెఎస్ఎస్ రుత్విక్, ఏ.పవనాంజనేయులు, షేక్.సాధిక్, బాలికల విభాగంలో షేక్.షాజ్మిన్ జెహ్రహ్, ఎం.చరణ్యరెడ్డి ఎంపికయ్యారు. అండర్–17 బాలుర విభాగంలో సిహెచ్.రేవంత్ సాయిరెడ్డి, పి.రామ్‌ధ్యాన్‌చంద్, ఎన్.ధీరజ్, బి.హర్షవర్ధన్‌రాజు, యు.శశికుమార్, బి.రాజశేఖర్ ఎంపికయ్యారు.

దిగుబడులు పెంపునకు సమష్టి కృషి


మాట్లాడుతున్న డాక్టర్ శివన్నారాయణ

గుంటూరు రూరల్: లాంఫాం వ్యవసాయ పరిశోధన స్థానంలోని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమగ్ర పోషక యాజమాన్యం 15 రోజుల సర్టిఫికెట్ కోర్స్ శిక్షణ తరగతులు శనివారం కొనసాగాయి. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకుడు డాక్టర్ ఎం. శివన్నారాయణ మాట్లాడుతూ.. తరగతుల్లో పాల్గొన్న ప్రతి పీఏసీఎస్ సంఘం ప్రతినిధి రైతులకు దిగుబడులను పెంచే అంశాలను తెలుసుకోవాలన్నారు. మేలైన దిగుబడులను ప్రతి పంటలో పొందేలా తోడ్పడాలని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ ఎస్‌వీవీఎస్ దుర్గాప్రసాద్, వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.రవీంద్రరెడ్డి, ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.వెంకటలక్ష్మి, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం. వెంకటరాములు, ప్రాథమిక సహకార సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం లాంఫాం నందు శనివారం అక్టోబర్ నెల శిక్షణ, సందర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. లాంఫాం ఏడీఆర్ డాక్టర్ ఎస్‌వీవీఎస్ దుర్గాప్రసాద్ అధ్యక్షత వహించారు. విస్తరణ సంచాలకులు డాక్టర్ ఎన్ శివన్నారాయణ, డీఏవోలు నున్న వెంకటేశ్వర్లు, మురళిలు పలు అంశాలపై వ్యవసాయ శాఖ అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో ఏడీఏలు, డీఆర్‌సీ సిబ్బంది, శాస్త్రవేత్తలు, డాట్ సెంటర్, కేవీకే శాస్త్రవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

విద్యాదీవెన, వసతి దీవెన బకాయిలు విడుదల చేయాలి


ఆర్జేడీ కళావతికి వినతి పత్రం సమర్పిస్తున్న ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శివారెడ్డి తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: పెండింగ్‌లో ఉన్న విద్యాదీవెన, వసతిదీవెన బకాయిలు విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శివారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం సాంబశివపేటలోని కళాశాల విద్య ఆర్జేడీ కార్యాలయంలో ఆర్జేడీ కళావతిని కలిసి వివిధ సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శివారెడ్డి మాట్లాడుతూ గుంటూరు నగరంలో ప్రభుత్వ కో–ఎడ్యుకేషన్ కళాశాలను ఏర్పాటు చేయాలన్నారు. డిగ్రీ విద్యా విధానంలో తీసుకువచ్చిన మార్పులతో విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, పరిష్కరించాలని కోరారు. వినతి పత్రం సమర్పించిన వారిలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి షేక్ మస్తాన్ షరీఫ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బందెల నాసర్ జీ, యశ్వంత్, సాయి, అమర్‌నాథ్, డేవిడ్, సాగర్ పాల్గొన్నారు.

పీఎం స్వనిధి రుణాలలో జీఎంసీకి జాతీయ అవార్డు

నెహ్రూనగర్: కేంద్ర ప్రభుత్వ పీఎం స్వనిధి (ప్రధాన మంత్రి స్ట్రీట్ వెండర్స్ ఆత్మనిర్భర్ నిధి) ద్వారా రుణాలు అందించినందుకు జాతీయ స్థాయిలో గుంటూరు నగరపాలక సంస్థకు అవార్డు దక్కింది. జీఎంసీ పరిధిలో 24,197 అప్లికేషన్‌లకుగాను బ్యాంక్‌ల ద్వారా 21,594 మంది చిరు వ్యాపారులకు రుణాలు అందించారు. తద్వారా కార్పొరేషన్‌లకు సంబంధించి జీఎంసీ తొలి స్థానంలో నిలిచిందని, దీనికి కృషి చేసిన మెప్మా సిబ్బందికి నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అభినందనలు తెలిపారు. ఈ నెల 29న విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగే అభినందన కార్యక్రమంలో ఈ అవార్డ్ ప్రదానం చేయనున్నారని పేర్కొన్నారు.

ప్రొవిజనల్ మెరిట్ లిస్టు విడుదల

నెహ్రూనగర్: గుంటూరు జిల్లాలో ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి సంబంధించి ప్రొవిజనల్ మెరిట్ లిస్టు శనివారం విడుదలైంది. పబ్లిక్ హెల్త్ వర్కర్, స్వీపర్, గ్యాంగ్ మజ్దూర్, డ్రెయిన్ క్లీనర్, కళాసీ, పోల్టెన్ సర్వెంట్ వంటి 20 పోస్టుల భర్తీకి సంబంధించి ఆగస్టు 6 నుంచి 13వ తేదీ వరకు సామర్థ్య పరీక్ష నిర్వహించారు. దీనికి సంబంధించి ప్రొవిజనల్ మెరిట్ లిస్టును గుంటూరు ఏపీ.ఇన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. ఈ మేరకు జిల్లా సెలక్షన్ కమిటీ సభ్యులు వెల్లడించారు.

లలిత హాస్పిటల్స్‌కు డైమండ్ అవార్డు



గుంటూరు మెడికల్: వరల్డ్ స్ట్రోక్ కాంగ్రెస్‌లో గుంటూరుకు చెందిన లలిత సూపర్ స్పెషాలిటీస్ హాస్పిటల్స్ వరుసగా నాలుగో ఏడాది డైమండ్ అవార్డును సాధించింది. ఈ విషయాన్ని శనివారం హాస్పిటల్స్ సీనియర్ న్యూరాలజిస్ట్ డాక్టర్ పమిడిముక్కల విజయ మీడియాకు వెల్లడించారు. అంకితభావంతో స్ట్రోక్ యూనిట్ ద్వారా పక్షవాతం రోగులకు ఉత్తమ చికిత్స అందించడంలో ప్రతిష్ఠాత్మక అవార్డును వరల్డ్ స్ట్రోక్ ఆర్గనైజేషన్ అందజేసినట్లు లలిత గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్, సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ పి.వి. రాఘవ శర్మ తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన కొన్ని స్ట్రోక్ కేంద్రాల్లో తమ కేంద్రం ఒకటన్నారు. డాక్టర్ విజయ అబుదాబిలోని క్లీవ్‌ల్యాండ్ క్లినిక్‌ను సందర్శించి, అక్కడి న్యూరో సైంటిస్టులతో అత్యాధునిక సాంకేతికత గురించి చర్చించారు. అక్టోబర్ 23 నుంచి 26వ తేదీ వరకు అబుదాబీలో జరిగిన 16వ వరల్డ్ స్ట్రోక్ కాంగ్రెస్ 2024లో ఆమె పాల్గొన్నారు. రికరెంట్ బ్రెయిన్ స్ట్రోక్‌లకు గల కారణాలపై పరిశోధన పత్రాన్ని సమర్పించారు. పరిశోధనలో 25శాతం మందికి రెండవ లేదా మూడవ సారి పక్షవాతం సంభవిస్తున్నట్లు గమనించారు. దీనికి ప్రధాన కారణం జీవితాంతం తీసుకోవాల్సిన యాంటి థ్రాంబోటిక్ ఔషధాలను మానివేయడమే అని డాక్టర్ విజయ తెలిపారు. ధూమపానం, మద్యం మానలేకపోవడం, రక్తపోటు, రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించక పోవడం మూడవ ప్రధాన కారణమని పేర్కొన్నారు.

ఆర్‌డీసీ సెలక్షన్లలో ఎన్‌సీసీ క్యాడెట్‌కు మూడోస్థానం


నిఖితను అభినందిస్తున్న కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు

నరసరావుపేట రూరల్: ఆంధ్ర, తెలంగాణ ఎన్‌సీసీ డైరక్టరేట్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన ఆర్‌డీసీ సెలక్షన్‌లో నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాల క్యాడెట్ మూడవస్థానం సాధించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.సునీల్ శనివారం తెలిపారు. ఈనెల 16 నుంచి 25వ తేదీ వరకు నిర్వహించిన ఆర్‌డీసీ సెలక్షన్లలో కళాశాలకు చెందిన జూనియర్ అండర్ ఆఫీసర్ పి.నిఖిత వ్యక్తిగత డ్రిల్ విభాగంలో ప్రతిభ కనబర్చి మూడవ స్థానంలో నిలిచినట్టు వివరించారు. ఢిల్లీలో జరిగే రిపబ్లిక్ డే పెరేడ్‌లో పాల్గొనేందుకు ఈ ఎంపికలు నిర్వహించినట్టు తెలిపారు. ఎంపికలో ప్రతిభ చూపిన నిఖితను కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు, 23వ ఆంధ్రా బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ సునీల్ గౌతమ్, కళాశాల ఎన్‌సీసీ ఆఫీసర్ మేడికొండ రాజేష్, అధ్యాపకులు అభినందించారు.

బాలల సంరక్షణ కేంద్రాలకు దరఖాస్తుల ఆహ్వానం

నరసరావుపేట ఈస్ట్: బాలల సంరక్షణ కేంద్రాలను నడుపుతున్న సంస్థలు, వ్యక్తులు తప్పనిసరిగా జువెనైల్ జస్టీస్ (పిల్లల సంరక్షణ, రక్షణ) చట్టం అనుసరించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని బాలల సంక్షేమం, సంస్కరణ సేవలు, వీధి బాలల సంక్షేమశాఖ పల్నాడు జిల్లా ఇన్‌ఛార్జ్ పర్యవేక్షణాధికారి బి.ఎ.సత్యనారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సదరు వ్యక్తులు లేదా సంస్థల నిర్వాహకులు గతంలో ఏదైనా చట్టానికి లోబడి లైసెన్స్ తీసుకున్నప్పటికీ జువెనైల్ జస్టీస్–2015 సెక్షన్ 41 కింద తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని స్పష్టం చేశారు. ఈమేరకు రాష్ట్ర బాలల సంక్షేమం, సంస్కరణల సేవల శాఖ సంచాలకులు ఉత్తర్వులు జారీ చేశారని వివరించారు. ఆయా కేంద్రాల నిర్వాహకులు లేదా వ్యక్తులు దరఖాస్తు చేసుకునేందుకు కావలసిన పత్రాలను htpp:wdcw.ap.gov.in వెబ్‌సైట్ నుంచి పొందవచ్చని తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను స్పీడ్ పోస్ట్ లేదా రిజిస్టర్ పోస్ట్ ద్వారా సంచాలకులు, బాలల సంక్షేమం, వీధిబాలల సంక్షేమశాఖ విజయవాడ కార్యాలయానికి పంపాలని తెలిపారు. అలాగే సాఫ్ట్ కాపీని cci.reg2024@gmail.com మెయిల్‌కు పంపాలని తెలిపారు. వివరాలకు బి.ఎ.సత్యనారాయణ 9100045422, డి.శౌరిరాజు జిల్లా బాలల సంరక్షణ అధికారిని 9491893673 నెంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

ముగిసిన ఎన్‌ఐఆర్‌ఎఫ్ నిపుణుల కమిటీ పర్యటన


కమిటీ సభ్యులతో వీసీ ఆచార్య కె.గంగాధరరావు, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం తదితరులు

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఎన్ఐఆర్ఎఫ్ నిపుణుల కమిటీ పర్యటన శనివారంతో ముగిసింది. కమిటీ సభ్యులు ఐక్యూఏసీ, లైబ్రరీ, హెర్బల్ గార్డెన్, బొటానికల్ గార్డెన్, ఇంక్యుబేషన్ సెంటర్, వెజిటేబుల్ గార్డెన్‌లను సందర్శించారు. లైబ్రరీలో ఆన్‌లైన్ జర్నల్స్ పరిశోధకులకు ఏ విధంగా అనుమతి ఇస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. ఐక్యూఏసీ, నాక్, ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకులు పొందేందుకు ఇచ్చిన నివేదికలను పరిశీలించారు. వాటి ఆధారంగా వర్సిటీ అధికారులకు పలు సూచనలు చేశారు. జాతీయ, అంతర్జాతీయ పరిశోధన ప్రాజెక్టులు పొందాలని, ఆ అవకాశాలు రెట్టింపు చేసుకోవాలన్నారు. అధ్యాపకులు పరిశోధకులతో ఇంటర్ డిసిప్లినరీ పరిశోధనల వైపు అడుగులు వేయాలని సూచించారు. శాస్త్ర సాంకేతిక రంగాల వైపు విద్యార్థులను నడిపేలా దృష్టి సారించాలన్నారు. విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలను ఎప్పటికప్పుడు వివరించాలని పేర్కొన్నారు. అనంతరం ఏఎన్‌యూ వీసీ ఆచార్య కె. గంగాధరరావు, రెక్టార్ ఆచార్య కె. రత్నషీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ కృష్ణ సత్య, ఇంజినీరింగ్ కళాశాల అసిస్టెంట్ ప్రిన్సిపల్స్ డాక్టర్ గోపీకృష్ణ, డాక్టర్ చంద్రమౌళి, ర్యాంకుల విభాగం కో ఆర్డినేటర్ డాక్టర్ పి.రవి తదితరులతో కమిటీ సభ్యులు సమావేశమయ్యారు.

జనవరి 5న హైందవ ధర్మ శంఖారావం

తాళ్ళాయపాలెం శైవక్షేత్ర పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ శివస్వామి


మాట్లాడుతున్న శివస్వామి

తాళ్ళాయపాలెం(తాడికొండ): విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో వచ్చే జనవరి 5వ తేదీన హైందవ ధర్మ శంఖారావం నిర్వహించనున్నట్లు తాళ్ళాయపాలెం శైవక్షేత్ర పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ శివస్వామి వెల్లడించారు. శనివారం తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం శైవక్షేత్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... జాతీయ స్థాయిలో చైతన్యం పెంచుతూ ప్రథమంగా విజయవాడ కేంద్రంగా ఈ శంఖారావం నిర్వహించడం హర్షణీయమన్నారు. దేశ వ్యాప్తంగా దేవదాయ ధర్మాదాయ శాఖ పరిధిలో ఉన్న దేవాలయాలను విముక్తి కలుగజేసి ఇతర మతాల తరహాలో స్వేచ్ఛగా కార్యకలాపాలు సాగాలని చెప్పడమేనన్నారు. విశ్వ జన పరిరక్షణ వేదిక, సాధు పరివార్, హిందూ సంఘాల ఐక్య కార్యాచరణ వేదిక సంయుక్త ఆధ్వర్యంలో మఠ, పీఠ, ఆశ్రమాల సమావేశాన్ని శైవ క్షేత్రం వేదికగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. విశ్వజన పరిరక్షణ వేదిక రెండు తెలుగు రాష్ట్రాల అధ్యక్షులు ఆత్మానంద భారతీ, విశ్వస్వామి, అష్టాజియర్ స్వామి, రాధా మనోహర్ దాస్ స్వామి, సాధుపరివార్ అధ్యక్షులు శ్రీనివాసానందస్వామి, చాముండేశ్వరి మహర్షి, దండిస్వామి, భవానీ స్వామి, నిరంజన్ దాస్ స్వామి తదితరులు పాల్గొని.. ఒకే నినాదం ఒకే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. ఏపీలో ఉన్న ప్రతి గ్రామం, జిల్లాలో సమావేశాలు ఏర్పాటు చేసి లక్షలాది మంది ప్రజలతో హైందవ ధర్మ శంఖారావాన్ని నిర్వహిస్తామని చెప్పారు.